అమ్మకోసం

శ్రీ 'దేవరకొండ'

కొడుకు ప్రశ్నకు పార్వతమ్మ నివ్వెరపోయింది.

చిందరవందరజుట్టు పైకితోసుకుంటూ కుడి చేత్తో, మళ్లీ నిలదీశాడు కిషన్రావు తల్లిని. 'చెప్పవేం, సమాధానం? చెప్పు. తక్షణం చెప్పు. చెప్పకపోతే...' వారోకట్ పాంటుజేబులోంచి సైకిల్ చెయిన్ తొంగిచూసింది. 'చెప్తాను, నాయనా, చెప్తాను, తప్పకుండా చెప్తాను.' ఆమె కాళ్లు వణికాయి. ఆ గోడదగ్గర చతికిలబడింది పార్వతమ్మ. పమిటికొంగుతో కళ్లు తుడుచుకుంది, 'ఏం, బాబూ, కొట్తావా, దాంతో? కొట్టు. కొట్టేకే చెప్తాను, నీ ప్రశ్నకి సమాధానం' అన్నది. ఆమె మాట తడబడింది. కిషన్రావ్, 'చెప్పు. నా ప్రశ్నకి అర్థంటుగా చెప్పాలి సమాధానం, ఊఁ', అని అరిచేడు, చేత్తులు పాంటుజేబుల్లో పెట్టూ. పార్వతమ్మ వణికే చేతులు చాపింది ముందుకు, 'ఇదిగో, నీకు అన్నం పెట్టిన చేతులు. కొట్టు నీకు తోచినట్టు ఆ చెయిన్తో. నేను మీ నాన్న నెందుకు పెళ్లిచేసికున్నానో తర్వాత చెప్తాను' అంటూ. కిషన్రావు చేతులు తీశాశాడు జేబుల్లోంచి. కుడిచేత్తో నెత్తి కొట్టుకుంటూ, మళ్లీ, 'అబ్బబ్బ! నన్ను విసిగించకు. నేను నిన్ను కొట్టను. చెప్పు నువ్వు నాన్న నెందుకు పెళ్లిచేసుకున్నావ్?' అంటూ రెట్టించాడు. 'నడు' నాయనా, అయితే. వంటింట్లోకి నడు. రెండు మెతుకులు పెట్తాను. చెప్తాగా సమాధానం!' అంది పార్వతమ్మ దుఃఖమాపుకుంటూ గోడగడియారం రెండు కొట్టింది.

'అవేం అక్కర్లేదు. ముందు చెప్పు సమాధానం' అని ఉరిమాడు కిషన్రావు కుర్చీ విసిరి లాగి కూర్చుంటూ. 'నువ్వు పుట్టడంకోసం!' అంది ఆమె, నెమ్మదిగా. 'నాన్సెన్స్, సరిగా చెప్పు. నువ్వు ఆంధ్రా వాణ్ణి ఎందుకు పెళ్లిచేసుకున్నావ్ అని అడుగుతున్నాను'. నొక్కి అడిగాడు కిషన్రావు 'ఏం ఆంధ్రా వాళ్లని పెళ్లిచేసుకోకూడదా?' .అంత అమాయకపు ప్రశ్న వస్తుందనుకోలేదు అతను. 'వీల్లేదు. వాళ్లు దోపిడీదార్లు, టక్కర్లు ... వీల్లేదు.' 'మీ నాన్న ఎవర్ని దోచుకున్నారు?'. 'అదంతాకాదు చెప్పమ్మా! నాకు సరిగా చెప్పు, సమాధానం', మళ్లీ అరిచాడు కిషన్రావ్, పిడికిలి బిగించి, చెయ్యి ఆడిస్తూ.

వీధి మెట్లమీద బూట్ల చప్పుడైంది. 'కిషన్! అవ్రే!' అని రెండుమూడు కంఠాలు వినిపించినై. 'అభీ ఆతుం!' అంటూ కిషన్ బయటికి రంయ్న వెళ్లిపోయాడు. 'ఒరే! కాస్త మజ్జిగైనా తాగి వెళ్లరా', పార్వతమ్మ మాటలకంటే వేగంగా సాగిపోయాయి ఆ బూట్లు ఎక్కడికో.

పార్వతమ్మకి కొడుకు ధోరణి ఏమీ అర్థం కాలేదు ఎక్కడికి పోతున్నట్టు? నిన్న కూడా జాడ లేదు. ఈవేళ వాళ్లనాన్న ఆఫీసుకు వెళ్లాక వచ్చాడు. వచ్చాక ఇదీ వరస. నువ్వు నాన్న నెందుకు పెళ్లిచేకుకున్నావని అడుగుతున్నాడు! తానేం చెప్తుంది సమాధానం?

* * *

పాతికేళ్ళయింది తన పెళ్లయి. రామ్మూర్తి మద్రాసులో ఇంజనీరింగు చదివి ఇంటికిచేరిన కొత్తరోజులవి. రామ్మూర్తి మద్రాసులో బయలుదేరిన మర్నాడే సీతయ్యగారుకూడా బయలుదేరాడు—హైద్రాబాద్లో, ఆరోజు మంచిదని. గోదావరిస్టేషన్లో దిగి, తిన్నగా ఇన్నిస్పేటకు జట్కా కట్టించాడు, సీతయ్యగారు.

తన తమ్ముని ఇంటిదగ్గర దిగాడు ముందు. నర్సింలు వీరేశలింగంగారి స్కూలులో తెలుగుపండితుడు. నర్సింలుకు తెలుగుమాష్టరీ కావలసివస్తే ఆ రోజుల్లో హైదరాబాద్‌లో దొరకలేదు. రాజమండ్రిదాకా పోవలసి వచ్చింది. వీరేశలింగంగారి స్కూలులో ఉద్యోగంతోపాటు పార్కుదగ్గర అద్దెకు ఇల్లుకూడా తీసికున్నాడు అప్పుడు. ఆ ఇల్లు తర్వాత నర్సింలు కొనేసి అక్కడే స్థిరపడిపోయాడు.

నర్సింలు మంచి పెళ్లికొడుకు ఉన్నాడని అన్నకు వ్రాయడంవల్ల సీతయ్య రాజమండ్రిదాకా వచ్చాడు. రామ్మూర్తి నర్సింలుదగ్గర స్కూలు ఫైనల్ దాకా చదువుకున్నాడు. రామ్మూర్తి తండ్రి సూరన్న కూడా నర్సింలుకు తెలుసు. తమ్ముడీ సంబంధం విషయం వ్రాయకపోతే, సీతయ్య పార్వతమ్మకు హైద్రాబాద్‌లోనే సంబంధం నిశ్చయం చేద్దామనుకున్నాడు.

అన్నదమ్ములిద్దరూ భోజనాలుచేసి, మధ్యాహ్నం రామ్మూర్తి ఇంటికి వచ్చారు. సీతయ్య ఇల్లు బయలుదేరిన వేళావిశేషం,-సూరన్నగారితో మాట్లాడటం హైద్రాబాద్‌లో పెళ్లిచూపులు ఏర్పాటు చేయడం తక్షణం జరిగిపోయింది. రామ్మూర్తికి పిల్ల నచ్చిందనగానే, పై మాటల విషయంలో సీతయ్య పట్టుపట్టలేదు. ఆ రోజులలో ఇంజనీరింగు చదివినవాళ్లు తక్కువ. ఉద్యోగాలకేకొదవా లేదు. ముచ్చటగా మూడు సంచులు చదివించమన్నాడు సూరన్న. సరే అన్నాడు సీతయ్యగారు, ఓసారి తమ్ముడికేసి చూసి. అట్లా జరిగిపోయింది పార్వతమ్మ వివాహం.

* * *

'నువ్వు నాన్న నెందుకు పెళ్లిచేసుకున్నావ్?' అంటే పార్వతమ్మ ఏమి చెప్తుంది సమాధానం? దిగులుదిగులుగా లేచింది పార్వతమ్మ, కూచున్న చోటునుంచి. వీధిగుమ్మందగ్గరికివచ్చి బయటికి చూచింది, ద్వారబంధం చేతులతో పట్టుకొని. తన స్నేహితులతో కొడుకెటుపోయాడో కనిపించలేదు. ఇంతసేపా! ఎటుపోయాడో ఏమో! 'తెలంగాణా జిందాబాద్'అనే నినాదం వినిపించింది ముక్తకంఠంతో దూరంగా. కొడుకు కంఠంకూడా వాటిల్లో ఉందేమో. పార్వతమ్మ గుండె ఝల్లుమంది. మనస్సు వికలమైంది. తలుపు గడియవేసికొని ఇంట్లోకి వెళ్లిపోయింది.

కాఫీ పెట్టుకోబుద్ధికాలేదు పార్వతమ్మకి. మూడు కావచ్చింది. ఇంకా రామ్మూర్తి బంట్రోతును పంపలేదు కాఫీకి. హోటలు సరుకు అతనికి నచ్చదు సిటీలో బిల్డింగులు కట్టించడంలో మంచిపేరు సంపాదించాడు రామ్మూర్తి. తన ఇంజనీరింగ్ డిగ్రీతో, సర్వీసులో జేరాడు సూపర్‌వైజర్‌గా రామ్మూర్తి, పెళ్లయిన కొత్తలో. రెండునెలలు చేయగనే తన ఉద్యోగంమీద అసహ్యం పుట్టింది రామ్మూర్తికి. పై ఆఫీసర్లు చెప్పినట్లుచెయ్యాలి, ప్రతిచిన్నపనీ, పెద్దపనీకూడా. చిత్తంచిత్తం అంటేగాని అది సర్కారుఉద్యోగం అనిపించుకోదట. తన డిగ్రీకి తగ్గట్టు, తెలివితేటలకు తగ్గట్టు కొత్తకొత్త పథకాలువేసి తానేమైనా కట్టిద్దామంటే వీల్లేదట. అటు కంట్రాక్టర్లకీ, ఇటు పై ఆఫీసర్లకి మధ్య తాను ఇరకాటంలోపడే సందర్భాలే అన్నీ. తక్షణం ఆ ఉద్యోగం వదిలేసి స్వేచ్ఛవాయువులు పీల్చుకున్నాడు ఇంజనీరు రామ్మూర్తి. ఆనాడు సూరన్నగారికి కిట్టలేదు, రామ్మూర్తి చేసినపని. ఆఖరికి 'ఓర్సీరు'గాపనిచేసి కూడా, వెనకేసి నిర్వాకం చేసిన వాళ్లెందరు లేరు? తనకొడుకు వాళ్లకేం తీసిపోయాడు?' తండ్రి ఆలోచనలు కిట్టలేదు రామ్మూర్తికి. తండ్రితో చెప్పి హైద్రాబాద్ వచ్చాడు, ఇక్కడి పరిస్థితులు చూద్దామని. శ్రద్ధగ మెలకువతో పని చేసుకుంటే మంచి ఆదరం దొరికేలాగ ఉంది చిన్న చిన్న పెంకుటిళ్లు దగ్గర్నించి సినిమాహాల్సు దాకా కట్టించొచ్చు. ఇతర కంట్రాక్టర్లమీద కాస్త తక్కువకే ఒప్పుకున్నా, చేయించిన పని బావుంటే అదే పదివేలు కంట్రాక్టులు తెస్తుంది. ఇసుక వంతెనలు గాలిమేడలు కట్టడం రామ్మూర్తి

వల్ల కానిపని. ముసలాయన వద్దన్నా రామ్మూర్తి రాజమండ్రినుంచి అట్లా హైదరాబాద్ వచ్చి స్థిరపడిపోయాడు కంట్రాక్టరుగా. తర్వాత రెండేళ్లకి పుట్టాడు కిషన్‌రావు. అప్పుడే రామ్మూర్తి కట్టాడు ఆ చిన్న పెంకుటిల్లు. పార్వతమ్మ మేడకట్టమని పట్టుపట్టింది, ఆమేడలో తిరగవలసిన కొడుకూ కోడళ్లను ఊహించుకుంటూ. కాని 'కొడుకు ఉద్యోగంలో జేరేక కట్టొత్తలే' అన్నాడు రామ్మూర్తి అప్పుడు.

మూడు దాటిపోయింది. కాఫీకి మనిషిని పంపలేదు రామ్మూర్తి ఇంతవరకు. పార్వతమ్మ మనస్సుకు స్థిమితంలేదు. సిటీబస్‌లు నడవడం లేదు కాబోలు. ఏ ఆందోళన వచ్చినా ముందు బస్‌లు, రైళ్లు సరిగా నడవడం మానేస్తాయి. ఆందోళనకారుల కోరికలన్నీ తీర్చడానికి వెళ్లి పోతాయేమో! టేబుల్ దగ్గరికి వెళ్లింది ఆమె వివిధభారతి పెడ్దామని. ట్రాన్సిస్టర్ కిషన్రావ్ ఈ మధ్యనే కావాలనికొన్నాడు. తానుచదివేది బి.యస్‌సి. ఫైనల్ కదూ!

కొడుకెక్కడికి పోయినట్టు? వాడి పిచ్చిగాని, హోటళ్లలో తినేతిండిఅంతా తాను పెట్టే చారు అన్నానికైనా సరిపోతుందా? కుఱ్ఱ మొగం, వాడికేం తెలుసు? తెలిసినవాడైతే ఇందాక తన్నా ప్రశ్న వేస్తాడా? తన తండ్రి ఆంధ్రుడని ఇరవై ఏళ్లకి తెలిసింది కాబోలు వీడికి! ఆంధ్రానెందుకు పెళ్లి చేసికున్నావని అడుగుతాడా, వెఱ్ఱివాడు కాకపోతే? తండ్రి తనకి తల్లికి ఏమి అపకారం చేశాడు? నిజం పార్వతమ్మకి తెలుసు. తన దగ్గరకంటె, రామ్మూర్తి దగ్గరే కిషన్‌రావుకి గారా మెక్కువ. ఒక్కడే కొడుకు అవడంవల్ల రామ్మూర్తికి కొడుకుమీదే పంచ ప్రాణాలూ. పసితనంలో అల్లరితో కొడుకు విసిగించినప్పుడు ఓసారి పార్వతమ్మ వాడి వీపుమీద రెండు అంటిస్తే, రామ్మూర్తి ఎంత రాద్ధాంతం చేశాడో. తన సంపాదన అంతా ఎవరికి, కొడుక్కి కాకపోతే? చేతిలో పనెక్కువైనకొద్దీ, రామ్మూర్తికి తీరిక తగ్గింది. అయితేనేం ఎప్పటికప్పుడు కొడుకు చదువుసంధ్యలు చూస్తూనేఉన్నాడు. కొడుకుచేత మెడిసిన్ చదివిద్దామనిఉంది రామ్మూర్తికి. కాని పి యు. సి. కిషన్ తిరిగ్గా పాస్ అయ్యాడు. కాలేజీలో ఎన్నివ్యవహారాలు మరి! కిషన్‌రావు డొనేషన్‌తో మెడిసిన్ చదువుతానంటే రామ్మూర్తి ఒప్పుకోలేదు డొనేషన్ డిగ్రీతో కొడుకు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటం రామ్మూర్తి కిష్టంలేని పని. అంచేత బి. యస్‌సి. చదవమన్నాడు కొడుకును. తర్వాత తనదగ్గరే తర్ఫీద్ ఇద్దామని. తన కంట్రాక్టులలో కనీసం రెండువందల మందైనా పనిచేస్తుంటారు రోజూ. ఇతర కంట్రాక్టర్లకంటె తాను పనిబట్టి పనివాళ్లందరికి ఒకటే అర్ధా ఎక్కువ ఇస్తాడు. తనకి మంచి పనికావాలి. కొడుకు నక్కడపెట్టి రాజమండ్రిలో కూడా కంట్రాక్టులు తీసికోవచ్చు తర్ఫీదులేందే, పనిలో మెలకువలు తెలియందే, కొడుకు స్వతంత్రంగా ఏమి చేయగలడు? పార్వతమ్మకి తెలుసు రామ్మూర్తి ఉద్దేశాలు.

ఎవరో దొడ్డి తలుపు కొట్టినట్టయింది. పని మనిషి కాబోలు. తలుపుతీసింది పార్వతమ్మ. 'అమ్మగారూ! బానండ్లు జల్ది ఎయ్యమ్మా. ఊర్లె శాన గడబడయితున్నది. పోరగాండ్లు లొల్లి సేస్తుండ్రు. జల్దీ ఇంటికి పోవాలె.' అంటూ సరసర మోరీ దగ్గరికి నడచింది పనిమనిషి. వంటింట్లోంచి వెళ్తూ పార్వతమ్మ అడిగింది ఏం జరిగిందని. 'ఈదినం మూడు సర్కారు మోటర్లు కాల్చిన్రంట. వాండ్లను పోలీసులు పట్కపోయిండ్రు. పట్నమంత మోటర్లల్ల తిరుగుతుండ్రు. అందరు దుకాన్లు గిట్ల బందు సేసిండ్రు. గుండా పోరగాండ్లు, ఏం చేస్తారో అంట. అందరు గుబులు పడ్తుండ్రు, ఇయ్యాలేపు పట్నంల బతికెడిదే కష్టమయితున్నదమ్మా.' అంది పని మనిషి. పార్వతమ్మ గుండెలు జలదరించాయి, ఆ మాటలు వింటుంటే. 'ఏ క్షణంలో రౌడీలు ఏం చేస్తారో, ఎవరికి తెలుసు? ఖర్మ!' అంది పార్వతమ్మ అంట్లు తోస్తూ. గబ గబ పని పూర్తిచేసి వెళ్లి పోయింది పనిమనిషి.

తలుపుగొళ్లెం పెట్టింది పార్వతమ్మ.

బిక్కుబిక్కుమంటూ ఒక్కతే ఉండాలి. రామూర్తి వచ్చేటప్పటికి రాత్రి రోజూ తొమ్మిదీ పదీ అవుతుంది. ఏ రోజు కూలి ఆ రోజు అందరికీ అన్ని బిల్డింగుల దగ్గరా ఇచ్చేసి రావాలి. కిటికీదగ్గరికి కూడా పోబుద్ధికాలేదు పార్వతమ్మకి. ఏ రాయైనా ఎగిరివస్తే? ఇల్లంతా కాలుకాలినపిల్లిలా తిరగడం మొదలెట్టింది పార్వతమ్మ.

దూరంగా ఏదో కోలాహలం వినిపిస్తోంది. రోడ్‌మీద రయ్‌రయ్‌మని కార్లు పోతున్నాయి హారన్ కొట్టుకుంటూ, రాళ్లదెబ్బలు తప్పించుకోడం కోసం కాబోలు. ఆ కోలాహలం క్రమక్రమంగా దగ్గరికి వస్తోంది. పార్వతమ్మ గుండె దడ ఎక్కువైంది. కిటికీతలుపులు కూడా గబగబవేసేసింది అన్నీ. హాల్ మధ్యస్థంగా నిలబడింది ఆమె. కాళ్లు గజగజ లాడుతున్నాయి. కూర్చుండిపోయింది పార్వతమ్మ అక్కడే. చెమటలు పడుతున్నాయి ఒళ్లంతా. రోడ్ మీద కేకలు ఇంకా దగ్గరగా వినిపిస్తున్నాయి. ఏవో అరుపులు, ఏ కంఠాని ఆ కంఠమే! ఏదో రౌడీ మూక కాబోలు. చేతులతో చెవులు మూసుకుంది. తన పిచ్చికాని, తాను చెవులు మూసుకుంటే, వాళ్ల కేకలు ఆగిపోతాయా? ముఖం మోకాళ్లమధ్య దాచుకుంది కళ్లు మూసుకొని.

పార్వతమ్మ ముక్కుకేదో వాసన అనిపించింది. వెనకెప్పుడో తానెక్కిన రిక్షా దొంగసారాపాకల ప్రక్కనించి పోతుంటే అట్లాంటి వాసనే వచ్చింది. కళ్లు విప్పి, మెల్లగా తలెత్తి అటూ ఇటూ చూసింది. బయట గొడవగొడవగాఉంది. ఇల్లంతా పొగ కమ్మేసింది చటుక్కున. ఎక్కణ్ణించివచ్చిందో ఈ పొగ. దాడ్లో ఏవో కంఠాలు వినిపించినై. 'దొంగలు, దొంగలు' అని కేకేద్దామనుకుంది పార్వతమ్మ. కాని నోరు పెగల్లేదు. ఆ పొగలో వీధిగుమ్మంవైపునుంచి శగ తగిలింది తనకి. అడుగుల చప్పుడు వినిపిస్తోంది. వీధిగుమ్మంమీదే కాబోలు అవి. గాభరాగా అటూ ఇటూ చూసింది. ఏవో కేకలువేసింది ఆ హాలులోంచి ఆమె.

లోపలనుంచి పార్వతమ్మ వేసేకేకలు నాలుగు గోడలు దాటి బయట ఎవరికి వినిపించలేదు ఆకేకలు మంటల అడుగునపడి చల్లబడిపోయినై. 'మా అమ్మ, మా అమ్మ' అని అరిచిఅరిచి మూగబోయింది ఓ కంఠం ఆ మూకఅరుపుల్లో. మూక ముందుకు వెళ్లిపోయింది. ఫైరింజన్ వచ్చి వెళ్లింది. పోలీస్ విధిగా వచ్చింది. రామూర్తి కారూ అటు వచ్చింది హడావిడిగా. ఆ కనుచీకటిలో అమ్మాఅంటూ వెక్కి వెక్కివచ్చే ఏడుపు వినిపించింది ఆగిన కార్లోకి. దూరంగా జై జై నినాదాలుకూడా వినిపించకపోలేదు.